హామీలు అమలయ్యేనా?

- 30 పడకల ఆసుపత్రికి రూ.10.50 కోట్లు మంజూరు
- డిగ్రీ కళాశాల మంజూరుపై ఆశలు
- దుబ్బాక రోడ్డు విస్తరణపై రెండు జిల్లాల ప్రజల ఎదురుచూపులు

ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. మండల కేంద్రమైన ముస్తాబాద్ మూడు జిల్లాల సరిహద్దులో ఉన్న ముఖ్యమైన పట్టణంగా వృద్ధి చెందుతోంది. ఇదే క్రమంలో మంత్రి కేటీఆర్ ఇక్కడ గడిచిన 15 ఏళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి చెరగని ముద్ర వేశారు. మరోవైపు ఇంకా కొన్ని హామీలు నెరవేర్చాల్సి వుంది. జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇంకా మిగిలి ఉన్న పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. 70 శాతం అభివృద్ధి పనులు జరిగినా, విద్య, వైద్యం, రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందేలా కేటీఆర్ దృష్టిసారించాలని కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు ఏనాడు అభివృద్ధిని పట్టించుకోలేదని, కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాక ముస్తాబాద్ ముఖచిత్రం మారిందని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఎన్నికల సందర్భంగా మండలంలో జరిగిన అభివృద్ధి, జరగాల్సిన పెండింగ్ పనులపై ప్రత్యేక కథనం..


ముస్తాబాద్ పట్టణం

పెండింగ్ పనులు ఇవే..

➡ ముస్తాబాద్‌కు 30 పడకల ఆసుపత్రి మంజూరు చేశారు. రూ.10.50 కోట్లు విడుదల చేస్తూ జీవో కూడా విడుదలైంది. అయితే పనులు మొదలు పెట్టేలోగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

➡ ముస్తాబాద్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ యాదవ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆరు నెలల క్రితం ప్రకటించారు. ఎవరో ఆందోళనలు చేస్తే తాను డిగ్రీ కళాశాల మంజూరు చేయడం లేదని, ఈ ప్రాంత పేద, యువత కోసం ఉన్నత విద్యను అందించేందుకు డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే పాలనపరమైన అనుమతులు రాకపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లు జరగలేదు.

➡ ముస్తాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా దుబ్బాక వరకు రోడ్డు విస్తరణకు మంత్రి కేటీఆర్ రూ.11 కోట్లు మంజూరు చేయించారు. రెండు నెలల క్రితమే మంజూరు జీవో విడుదల కాగా, మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పనులను మొదలు పెట్టాల్సి వుంది. ఈ నేపథ్యంలో వచ్చిన ఎన్నికల షెడ్యూల్‌తో ఆ పనిని వాయిదా వేశారు. మండలంలోని ఈ ఒక్క రోడ్డు తప్ప, అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు, బీటీ రోడ్లు పూర్తయ్యాయి.

➡ ముస్తాబాద్‌లో పిల్లల పార్క్ నిర్మించాల్సి వుంది. పెద్ద చెరువుకు గండి పడి ఏడేళ్ల క్రితం కొట్టుకుపోయింది. అప్పుడే రూ.6 కోట్లతో చెరువును అభివృద్ధి చేసి, మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. ట్యాంక్‌బండ్ కిందనే పిల్లల పార్క్ చేపట్టాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అయితే టూరిజం, నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో పార్క్ పనులు పెండింగ్‌లో పడ్డాయి.

➡ ముస్తాబాద్‌లో ఇళ్లు లేని పేదలు ఇంకా ఉన్నారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయి. అర్హులైన పేదలకు ఇళ్లు దక్కలేదనేది వాస్తవిక విషయం. ఇలాంటి వారికి గృహలక్ష్మి ద్వారా ఇళ్లు కట్టిస్తామన్న అధికార పార్టీ నాయకుల హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు.


ముస్తాబాద్ జూనియర్ కళాశాల

జరిగిన అభివృద్ధి పనులు

➡ ముస్తాబాద్ నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువ చేసే పోలీస్‌స్టేషన్ స్థలాన్ని మంత్రి కేటీఆర్ చొరవతో పంచాయతీకి బదలాయించారు. ముస్తాబాద్‌లోనే తొలి మోడల్ పంచాయతీ భవనం రూపుదిద్దుకుంది.

➡ వంద ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపట్టారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులతో పట్టణ శోభ సంతరించుకుంది.

➡ ముస్తాబాద్ పెద్ద చెరువును మినీట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేశారు.

➡ 20 ఏళ్ల ఒకసారి కూడా నిండని పెద్ద చెరువులోకి ప్రతి వేసవిలో గోదావరి జలాలతో నింపుతున్నారు. భూగర్భజలాలు పెంచారు. మండు వేసవిలో మత్తళ్లు దూకుతోంది.

➡ ముస్తాబాద్‌లో 154 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారు. మౌలిక వసతులు కల్పించారు.

➡ ముస్తాబాద్‌లో ఎస్సీ గురుకులం ఇంటర్ విద్యతో ఏర్పాటు చేశారు.

➡ ముస్తాబాద్ నుంచి జిల్లెల్ల, ముస్తాబాద్ నుంచి పోతుగల్ మీదుగా సిరిసిల్లకు, ముస్తాబాద్ నుంచి సిద్దిపేటకు డబుల్ రోడ్లు నిర్మించారు.

➡ ముస్తాబాద్‌లో రైతువేదిక, అంబేద్కర్ భవన్ నిర్మిస్తున్నారు.

ముస్తాబాద్‌లో ఆసుపత్రి నిర్మించాలి



ముస్తాబాద్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించాలి. ఆసుపత్రి మంజూరు చేయడం అభినందనీయం. ఆసుపత్రి పనులు వెంటనే చేపట్టాలి. మంత్రి మంజూరు చేసిన ఆసుపత్రితో పేదలకు ఉచిత వైద్యం అందుతుంది.
– మాదూరి కిషన్, ముస్తాబాద్

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి



డిగ్రీ కళాశాల లేక పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. హైదరాబాద్, సిద్దిపేట వెళ్లలేకపోతున్నారు. మంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలి. మండల కేంద్రంలో ఉన్నత విద్య అందుబాటులోకి రావాలి.
– గుండెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ

ఐదేళ్లలోనే అభివృద్ధి జరిగింది



మంత్రి కేటీఆర్ చొరవతో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో జరిగింది. నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడు మోడల్ పంచాయతీ కట్టాం. చెరువును మినీ ట్యాంక్‌బండ్ చేశాం. సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ చేశాం.
– నల్ల నర్సయ్య, మాజీ సర్పంచ్, ముస్తాబాద్

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీవో శ్రీనివాస్


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోని, మద్దతు ధర పొందాలని సిరిసిల్ల డీఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం తేమ శాతం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక నిర్వహణతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ట్యాబ్ డేటా ఎప్పటికప్పుడు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కార్యక్రమంలో డీపీయం పాపారావు, ఏపీయం మార్కెటింగ్ శ్రీనివాస్, కేంద్రం ఇన్‌చార్జి సుదర్శన్, మంగ్యానాయక్, వీవోఏ శోభ, సరిత, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం


పాఠశాలలో శ్రమదానం చేస్తున్న పోలీసులు

సిరిసిల్లఅర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 17వ బెటాలియన్ పోలీసులు మంగళవారం శ్రమదానం చేపట్టారు. పాఠశాలలోని చెత్త చెదారం, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించి, పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్స్ జయప్రకాశ్‌నారాయణ, పార్థసారథి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్ సోషల్‌మీడియా కన్వీనర్‌గా ప్రభాకర్

కోనరావుపేట: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా కోనరావుపేటకు చెందిన బండి ప్రభాకర్(పాల్)ను నియమిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సూచన మేరకు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన మండల శాఖ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, మండల నాయకులకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వకర్మ సింహగర్జనను విజయవంతం చేయాలి

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో ఈ నెల 2న నిర్వహించే విశ్వకర్మ సింహ గర్జన మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు చందన గిరి గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని విశ్వకర్మలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏనుగుల సత్యం, ఆంజనేయులు, రమేశ్ పాల్గొన్నారు.

రూ.1.10 లక్షలు పట్టివేత.. తిరిగి అప్పగింత

వేములవాడరూరల్: మండలంలోని జిల్లా సరిహద్దు ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం రూ.1.10 లక్షలు పట్టుకున్నారు. జగిత్యాల నుంచి ఓ వ్యక్తి డబ్బులు తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు తెలిసింది. అతని వద్ద పూర్తి ఆధారాలు ఉండటంతో పరిశీలించి, డబ్బులను తిరిగి అప్పగించినట్లు పేర్కొన్నారు.

గొల్ల కురుమలతో సమావేశం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో గొల్ల కురుమలతో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్లకురుమలను ఆదుకున్న బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికలలో అండగా నిలవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీను, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సెస్ మాజీ డైరెక్టర్ బాలయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, ఎల్లం, రమణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి


వేములవాడలో


ఎల్లారెడ్డిపేటలో..

వేములవాడ: దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పట్టణంలోని ఆది శ్రీనివాస్ నివాసంలో నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు మాందాల లింబయ్య, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు ముదాం సత్యం, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మంగిలిపల్లి శంకర్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న బెటాలియన్ అధికారులు

సిరిసిల్లఅర్బన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని జిల్లాలో నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ శ్రీనివాస్‌రావు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు, పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో పటేల్ విగ్రహానికి మున్సిపల్ మాజీచైర్మన్ ఆడెపు శిరస్వాల్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాలలో సమైక్యత ప్రతిజ్ఞ చేశారు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, బిక్షమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు.

'కేసీఆర్.. కేటీఆర్ గెలవాలి'


తుల్జా భవాని అమ్మవారి సన్నిధిలో నాయకులు

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు గెలువాలని వేడుకుంటూ మహారాష్ట్రలోని షోలాపూర్ శివారులోని తుల్జాపూర్‌లో సిరిసిల్ల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పూజలు నిర్వహించారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకులు గుండ్లపల్లి పూర్ణచందర్‌తో పాటు నాయకులు వంగరి గోపి, సింగం శరత్, శ్రీపతి సురేశ్, కోయల్‌కార్ మనోజ్ ఉన్నారు.

'సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు'


ప్రచారం చేస్తున్న జోగినిపల్లి రవీందర్‌రావు

బోయినపల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాలే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి దోహదపడుతాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని అనంతపల్లి, గుండన్నపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, చెన్నాడి అమిత్‌కుమార్, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కొనుకటి లచ్చిరెడ్డి, కొప్పుల స్వామి, జంగ సత్యం, కంకణాల పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

చల్మెడను గెలిపించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి ప్రచారం


తిప్పాపూర్‌లో ప్రచారం చేస్తున్న మాధవి

వేములవాడఅర్బన్: వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును గెలిపించాలని మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లతో కలిసి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, జడల లక్ష్మీ, నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, నాయకులు ఎలా శ్రీనివాస్, రాజు, పర్శరాములు తదితరులు ఉన్నారు.

కోనరావుపేటలో..

కోనరావుపేట: మండలం వెంకట్రావుపేట, కనగర్తి, ధర్మారం, కొలనూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు సంతోష్, భారతి, ఎంపీటీసీలు లింగంపెల్లి లక్ష్మి, పల్లె మంజుల, వికలాంగుల సంఘం అధ్యక్షుడు పల్లం లింగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు జొర్రిగ మల్లేశం, పుట్ట గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'మా మద్దతు కేటీఆర్‌కే'



తంగళ్లపల్లి: ఎన్నికల్లో మంత్రి కేటీఆర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బాబాజీ కులస్తులు ప్రకటించారు. మండల కేంద్రంలోని బాబాజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసి తీర్మానం కాపీని ఎంపీపీ పడిగెల మానసకు అందజేశారు. అధ్యక్షుడు ఇనుకొండ మారయ్య, ఉపాధ్యక్షుడు మ్యాకల సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి చల్లా దేవయ్య, తిరుపతి, తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి ప్రచారం చేశారు.

గంభీరావుపేట: మండలంలోని కోళ్లమద్ది, శ్రీగాధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ద్యానబోయిన రాజేందర్ ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టోలను అందించారు. మండల ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ కొమిరిశెట్టి లక్ష్మణ్, మానేరు నీటి సంఘాల మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చేరాల వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ గెలుపు'

ముస్తాబాద్: ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ గెలుపు తీరాన్ని చేరుతుందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లిమక్తలో..

కోనరావుపేట: మండలం పల్లిమక్తలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, చిద్రవేణి ప్రభాకర్, మోకెనపల్లి కిషన్, ఆదిరెడ్డి, జాగిరి ఆనందం, నర్సయ్య, బాలరాజు, చంద్రయ్య, శంకరయ్య పాల్గొన్నారు

కొడుముంజలో..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ, శాభాష్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. ముంపు గ్రామల్లోని సమస్యలపై అయనకు పూర్తి అవగహన ఉందాన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు కదిరె రాజు కుమార్, పండగ ప్రదీప్, ఎంపీటీసీ బస రాజశేఖర్, చింతపల్లి శ్రీనివాసరావు, ఎర్రం రాజు, ఎర్రం ఆగయ్య, చిలివేరి శ్రీనివాస్, పర్శరాములు, దేవరాజు, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్ తదితరులు ఉన్నారు.


కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కేకే మహేందర్‌రెడ్డి పట్టణంలోని ఓ జ్యూస్ సెంటర్‌లో జ్యూస్ చేస్తూ ఓట్లు అభ్యర్థించడం ఆకర్షించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, సిరిసిల్ల

బీజేపీపై అభిమానం పెరుగుతోంది

కోనరావుపేట: బీజేపీపై ప్రజల్లో అభిమానం పెరుగుతోందని బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని నిమ్మపల్లి, కొండాపూర్, శివంగాలపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారాన్ని నిర్వహించారు. వేములవాడ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను ఆశీర్వదించాని కోరారు.

బీజేపీలోకి మాజీ మావోయిస్టు

మండలంలోని శివంగాలపల్లి గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి మంగళవారం చెన్నమనేని వికాస్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఆమెతో పాటు నిమ్మపల్లిలో 100 మంది, శివంగాలపల్లిలో 30 మంది యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వికాస్‌రావు మాట్లాడుతూ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, ఎంపీటీసీ కోనేటి రేణుక, నాయకులు పాల్గొన్నారు.


వికాస్‌రావు సమక్షంలో పార్టీలో చేరిన జ్యోతి

ఏ పార్టీలో చేరలేదు

తాను ఏ పార్టీలో చేరలేదని మాజీ మావోయిస్టు నేరెళ్ల జ్యోతి 'సాక్షి'తో అన్నారు. మామూలుగా రమ్మని పిలిస్తే వెళ్లానని తెలిపారు.

పెన్షన్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

గంభీరావుపేట: లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్ ఇవ్వలేని దుస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేశ్ విమర్శించారు. కేసీఆర్ మోసపూరిత, అమలుకు నోచుకోని హామీలతో తిరిగి గద్దెనెక్కాలని చూస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని, కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉల్లి వెతలు


ఉల్లి ఎప్పుడు కోసినా, కొన్నా కన్నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుతం కిలో ధర రూ.80 నుంచి రూ.100 వరకు చేరింది. ఈనేపథ్యంలో జనానికి ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై కిలో ఉల్లిగడ్డను కేవలం రూ.25కే విక్రయిస్తుంది. మంగళవారం జిల్లాకేంద్రంలో సబ్సిడీపై ఉల్లిగడ్డలు విక్రయిస్తుండగా సంబంధిత వాహనం వద్ద జనం ఇలా ఎగబడి కొనుగోలు చేశారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, సిరిసిల్ల

రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటాలి



సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వెంకంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఉదయం పాపులేషన్ ఎడ్యుకేషన్ సెల్ జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు, మధ్యాహ్నం జిల్లా స్థాయి సైన్స్ డ్రామా కాంపిటీషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో రమేశ్‌కుమార్ హాజరయ్యారు. నృత్య పోటీల్లో మొదటి స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ వీర్నపల్లి, ద్వితీయ స్థానం నిజామాబాద్ జెడ్పీహెచ్‌ఎస్, తృతీయ స్థానం జెడ్పీహెచ్‌ఎస్ బద్దెనపల్లి, సైన్స్ డ్రామా పోటీలో మొదటిస్థానం జెడ్పీహెచ్‌ఎస్ నిజామాబాద్ నిలిచాయి. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని డీఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం పొలాస మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ వారం ఆరోగ్య మహిళ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతీ వారం నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. మంగళవారం సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ, నేరెళ్ల, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపీడీ(595), బ్రెస్ట్(582), ఓరల్ కావిటీ(585) పరీక్షలు జరిపినట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ(07), ల్యాబ్(118), థైరాయిడ్(75), విటమిన్ డీ(43), సీబీపీ(96), సూక్ష్మ పోషకాలు(37) మందికి పరీక్షలు చేసి, వీరిలో ఏడుగురిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.